క్లుప్తంగా

ఏఎన్‌ఎంలకు ఆత్మీయ వీడ్కోలు

మద్దిపాడు: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన 15 మంది ఏఎన్‌ఎంలను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రావణ్, వినీల చౌదరి, జగదీష్‌బాబు, అవినాష్‌లు మాట్లాడుతూ మద్దిపాడులో ఇంత కాలం వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు తీసుకొచ్చారని, బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసిన విధంగానే బదిలీపై వెళ్లిన చోట కూడా మంచి పేరు తెచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు. నూతనంగా బదిలీపై వచ్చిన వారికి ఆహ్వానం పలుకుతూ ఆసుపత్రి పేరును నిలబెట్టాలని కోరారు. అనంతరం కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సిబ్బందికి స్వాగతం పలుకుతూ, బదిలీపై వెళ్తున్న వారిని ఘనంగా సన్మానించి వారికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్లు రజిత కుమారి, లలితమ్మ, హెచ్వీలు నాగరాజు, సీతమ్మ, సూపర్వైజర్ బాలకోటయ్య, వైద్య శాఖ సిబ్బంది, హెచ్‌ఏలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కారు ఢీ-ఇరువురికి తీవ్రగాయాలు

నాగులుప్పలపాడు: మోటారు సైకిల్ ను కారు ఢీకొన్న ఘటనలో ఇరువురు వ్యక్తులకు తీవ్రగాయాలైన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై రజియా సుల్తానా సమాచారం మేరకు నిడమానూరు ముస్లిం కాలనీకి చెందిన అన్నదమ్ములు ఆదయాన్నే తమ మోటారు సైకిల్‌పై గ్రోత్ సెంటర్ వైపు వస్తున్నారు. ఈక్రమంలో అటు వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో అన్నదమ్ములకు తీవ్రగాయాలై కాళ్లు విరిగిపోయాయని తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలుకు తరలించి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.1కే బీఎస్‌ఎన్‌ఎల్ నెలవారీ రీచార్జి

ఒంగోలు వన్‌టౌన్: ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.1కే నెల రీచార్జితో సరికొత్త ఫ్రీడం ప్లాన్ ప్రవేశ పెట్టిన్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్ గుంటూరు ఏరియా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ సప్పరపు శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ ఈ ప్లాన్ అందుబాటులో ఉంటుందన్నారు.

లక్ష్మణాచారి మృతి విచారకరం

ఒంగోలు మెట్రో: ఒంగోలుకు చెందిన తొలితరం తబలా, మృదంగ విద్వాంసుడు పుల్లేటికుర్తి లక్ష్మణాచారి (72) మరణించడం బాధాకరమని మంగళవారం పలువురు పేర్కొన్నారు. మంగళవారం లక్ష్మణాచారి వయోభారంతో ఆయన నివాసంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సాహితీవేత్తలు, సంగీత ప్రియులు ఆయనకు ఘన నివాళులర్పించారు. గత ఐదు దశాబ్దాలుగా ఒంగోలు నాటక రంగం, శాస్త్రీయ సంగీత రంగంతో ఆయనకున్న అనుబంధాన్ని తలుచుకున్నారు. అనేకమంది ప్రముఖుల నాటకాలకు ఆయన సంగీత దర్శకత్వం వహించాడని చెప్పారు. ప్రముఖ గాయకుడు మరుధూరి రామకృష్ణ, లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంత వేలూరు కోటేశ్వరరావు, సీనియర్ రంగస్థల నటుడు మరుధూరి సత్యసాయి, సాహితీవేత్త నెమ్మాని సీతారామమూర్తి, ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు శ్రీనివాసులు తదితరులు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.

గిరిజన వసతి గృహం పరిశీలన

ఒంగోలు వన్‌టౌన్: నగరంలోని గిరిజన సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహాన్ని రాష్ట్ర ఎస్టీ కమీషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతొనే ఈ ఘటన జరిగిన్నట్లు తెలుస్తుందన్నారు. గిరిజన పిల్లలపై కొంత మంది బయటి వ్యక్తుల సాయంతో సీనియర్ హాస్టల్ విద్యార్థులు దాడి చేశారన్నారు. ఈ దాడిలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయన్నారు. విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలన్నారు.

సామూహిక మంగళ గౌరీ వ్రతాలు



సమతానగర్ కనకదుర్గమ్మ వారి దేవస్థానంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: శ్రావణమాసం మంగళవారం మంగళ గౌరీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు నగరంలోని మంగమూరుడొంక గాయత్రి మందిరంలో, బాలాజీరావుపేటలో కనకదుర్గ అమ్మవారి దేవస్థానం, లాయరు పేట షిర్డి సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న రాజరాజే శ్రీదేవికి, కేశవస్వామి పేటలోని, విజయదుర్గ అమ్మవారి దేవస్థానం, గద్దలగుంట మహంకాళి మహాలక్ష్మి, మహా సరస్వతి ఆలయం, కమ్మపాలెంలోని కాళికా పరమేశ్వరి దేవస్థానం, గొడుగుపాలెంలోని పార్వతమ్మ దేవస్థానం, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర ఉన్న మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, రాజలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిర్డి సాయిబాబా మందిరంలో నాగలక్ష్మి అమ్మవారికి, సమతానగర్ కనకదుర్గమ్మ దేవస్థానం, కేశవస్వామి పేటలోని అతి పురాతన కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో గంగా అన్నపూర్ణ అమ్మవారికి, నెహ్రూ కాలనీలోని కనకదుర్గమ్మ వారికి ఆలయ అర్చకులు ఉదయం మహిళా భక్తుల చేత సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.



నెహ్రూ కాలనీలోని కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చనలో మహిళలు



ప్రత్యేక అలంకరణలో మంగళగౌరీ దేవి

డ్రోన్ సాంకేతికతతో ఉన్నత అవకాశాలు



మాట్లాడుతున్న డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: డ్రోన్ సాంకేతికతతో విద్యార్థులకు ఉన్నత అవకాశాలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీపై ఇంటర్న్‌షిప్‌ని ప్రారంభించినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి తెలిపారు. మేఘాలయా షిల్లాంగ్ లోని నార్త్ ఈస్ట్ సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ రీచ్ (నెక్టార్), క్విస్ ఇంజినీరింగ్ కాలేజి సంయుక్తంగా ఈ ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. నెల రోజుల పాటు విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ అందించనున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నెక్టార్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. డ్రోన్ టెక్నాలజీ రోజు రోజుకి అభివృద్ధి చెందుతుందని, ఈ ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం సూర్యకల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. క్విస్ ప్రపంచ అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్విస్ కళాశాలలో బోధన జరుగుతుందన్నారు. శ్రీగాయత్రి మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీపై జరుగుతున్న ఈ ఇంటర్న్ షిప్ ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, డీపీఎస్ ఆర్ డీన్ డాక్టర్ భార్గవ్, డీన్‌లు, డైరెక్టర్లు, హెచ్‌వోడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఫోన్లు మాకొద్దు.. మీరే తీసుకోండి !

మద్దిపాడు: మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్లు తమకు ఇచ్చిన 2జీ ఫోన్లలో అధికారులు ఇచ్చిన ఏ యాప్ పనిచేయటం లేదని.. అందువలన తాము ఫోన్లను అధికారులకు తిరిగి ఇచ్చేస్తున్నట్లు అంగన్వాడీ వర్కర్లు తెలిపారు. 2-జీ ఫోన్లపై పనిచేయాలంటే ఒక్కొక్కరికి గంట సమయం తీసుకుంటుందని ప్రతి చిన్నారిని నమోదు చేయాల్సి రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేరే పని లేకుండా యాప్‌లో నమోదు చేయడమే పెద్ద లక్ష్యంగా మారుతుందన్నారు. ఈ క్రమంలో తాము ఫోన్లు ఇచ్చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందని అంగన్వాడీలు తెలిపారు. కొత్త ఫోన్లు ఇచ్చేవరకు తాము రిజిస్టర్‌లోనే సంతకాలు చేస్తామని వారు తెలిపి, తమ ఫోన్లను మద్దిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వద్ద ఉంచి తమ బాధను ఉన్నతాధికారులకు తెలియజేయాల్సిందిగా ఆయనను కోరారు. తమ ఉన్న సెల్ ఫోన్లు చూపుతూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.



ఫోన్లు చూపుతూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

ఒంగోలు సిటీ: ఒంగోలు ఎస్ఎస్ఎన్ కళాశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 600 మంది పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఒంగోలులోని మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 'సర్వేంద్రియానం నయనం ప్రధానం' అన్నట్లు మనిషి శరీరంలో అన్ని అవయవాలు కంటే మన కళ్లు ప్రధానమైనవన్నారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకి ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు మోడరన్ ఐ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వెంకట రమణరెడ్డి విచ్చేసి జాగ్రత్తలు వివరించారు. డాక్టరు అర్పణ షాఫర్, డీఓఏ ఎం నాగరాజు, పి నిఖిల, టి స్వర్ణలత, పీఆర్వో సురేందర్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారులు టి రాజేంద్రబాబు, పి రవి తేజ,పి నీలిమ సిబ్బంది పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రెడ్డిపాలెంలో క్షుద్రపూజల కలకలం



క్షుద్ర పూజలు చేసిన దృశ్యం

కొత్తపట్నం: ప్రశాంతంగా ఉన్న ఆ గ్రామం ఒక్కసారిగా భయాందోళనకు గురైంది. క్షుద్ర పూజలు, చేత బడులు చేయడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లో వెళ్తే.. కొత్తపట్నం మండలో రెడ్డిపాలెం గ్రామంలో చేపల మార్కెట్ సమీపంలో పురిణి ఆంజనేయులు నివాసం ఉంటున్నాడు. ఇతను బైక్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. సోమవారం రాత్రి ఎప్పటిలాగే పనులు ముగించుకొని ఇంటికి వచ్చాడు. ఉదయం 6 గంటల సమయంలో లేచి చూసేసరికి ఇంటిముందు క్షుద్ర పూజలు, చేతబడి చేసిన ఆనవాళ్లు కనబడ్డాయి. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇటువంటి ఘటనలు గ్రామంలో ఎప్పుడూ జరగలేదని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. దీనితో ఆంజనేయులు స్థానిక ఎస్సై సుధాకర్‌బాబు, సీఐ మేడా శ్రీనివాసరావుకు, 100 ఫోన్ ద్వారా సమాచారాన్ని తెలిపారు. స్పందించిన ఎస్సై ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఆర్టీసీ స్థలాన్ని లులుకు కేటాయించడం దారుణం

ఒంగోలు టౌన్: ప్రజలకు సౌకర్యంగా ఉన్న ఆర్టీసీ బస్టాండును ఎత్తివేసి ప్రైవేటు కార్పొరేట్ సంస్థలు లులు మాల్‌కు కేటాయిస్తూ కూటమి ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వు నెంబి 137 ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు వాకా రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లులు మాల్‌కు నగర శివారు ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అందుకు బదులుగా నగరం నడిబొడ్డున మాల్ ఏర్పాటు చేయడం వలన మాల్ యాజమాన్యం మాత్రమే అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈ నెల 15వ తేదీఊ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నందున ఇక్కడ మరింత రద్దీ ఏర్పడే అవకాశం ఉందన్నారు.

12వ పీఆర్సీ నియమించ లేదు..

ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. 2014లో ఇదే టీడీపీ ప్రభుత్వం విజయవాడ సమీపంలో ఉన్న ఆర్టీసీ డ్రైవింగ్ కళాశాలకు చెందిన 29 ఎకరాల స్థలాన్ని హెచ్‌ఈఎల్ కంపెనీకి ధారదత్తం చేసిందని, అందుకు బదులుగా ప్రభుత్వం ఇస్తామని చెప్పిన స్థలాన్ని ఇంతవరకు ఇవ్వలేదని గుర్తు చేశారు. యూనియన్ సలహాదారుడు ఎన్. తిరుమహేష్, జిల్లా కార్యదర్శి పోలయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నప్పటికీ డీఏ బకాయిలను చెల్లించలేదని, 12వ పీఆర్సీ నియమించలేదు, ఐఆర్ ఇవ్వలేదు కానీ ఆర్టీసీకి చెందిన విలువైన స్థలాలను మాత్రం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు చేయడం దాని చిత్త శుద్ధిని నిరూపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈయు జిల్లా జాయింట్ కార్యదర్శి బెజవాడ రవి, రామకృష్ణ, బిఎస్ రెడ్డి, సీవీఎస్ రావు, సుబ్బారావు, నాగులు, తిరుపతమ్మ, శేఖర్‌నాయుడు, కొండలరావు, అంజయ్య, వెంకటరావు, సలియ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

11న రంగభూమి కళాకారుల ర్యాలీ

ఒంగోలు మెట్రో: కళాకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రంగభూమి కళాకారులు డిమాండ్ చేశారు. మంగళవారం సమస్యలను పరిష్కారం కోసం నగరంలోని సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో జిల్లా రంగభూమి కళాకారులు, జిల్లా పౌరాణిక రంగస్థల కళాకారుల సమాఖ్య, జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య నాయకులు సమస్యల పరిష్కారం కోసం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా రంగభూమి కళాకారుల సంఘం కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ మాట్లాడుతూ.. ఈనెల 11వ తేదీ ఉదయం సోమవారం 10 గంటలకు రీడింగ్ రూమ్ ఆవరణలో ఘంటసాల వెంకటేశ్వరావు నివాళులర్పిస్తారన్నారు. అక్కడ నుంచి కళాకారుల వేషాధారణలతో ర్యాలీగా ఏనుగు చెట్టు, హెచ్‌సీఎం కాలేజీ, చర్చి సెంటర్ మీదగా నెల్లూరు బస్టాండ్ వద్ద ఉన్న డీవీ సుబ్బారావు, బండారు రామారావు విగ్రహాలకు నివాళులర్పిస్తారన్నారు. అక్కడి నుంచి ప్రకాశం భవనం దగ్గర గుర్రం జాషువా, టంగుటూరు ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి అధికారులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జి. వెంకట్రామయ్య, రంగారావు, జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య అధ్యక్షులు ఎస్ కే బాబు, మాకా ఆంజనేయులు డప్పు కళాకారుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు జె ఆంజనేయులు, అనంతలక్ష్మి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ కరపత్రం ఆవిష్కరిస్తున్న కళాకారులు

రెడ్ల సమస్యలపై చర్చించిన ఆర్సీడీఎస్ కోఆర్డినేటర్



వైఈపీ రెడ్డిని సత్కరిస్తున్న వెంకట సుబ్బారెడ్డి

ఒంగోలు వన్‌టౌన్: రాష్ట్రంలో పేద రెడ్ల సమ్యలపై రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ కో ఆర్డినేటర్ డాక్టర్ మండ్ల వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు వైఈపీ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పేద రెడ్ల విద్యార్థులు వారికి అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ప్రజలను మోసం చేసిన బీజేపీ, టీడీపీ

కొత్తపట్నం: బీజేపీ, టీడీపీలాంటి పెత్తందారుల పార్టీలను వదిలి పేదలు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి కొత్తపట్నంలో పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాబోయే 2029లో అసెంబ్లీ ఎన్నికల్లో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీని అసెంబ్లీలో చూడబోతున్నామన్నారు. 75 సంవత్సరాల పాలన సాగించిన ప్రభుత్వాలు ఏవిధంగా విఫలమయ్యాయో ప్రత్యక్షంగా చూశామన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేర్చలేకపోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుల నుంచి నగర కార్పొరేషన్ మేయర్ వరకు పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మహిళా కన్వీనర్ ఐశ్వర్య, జిల్లా కన్వీనర్ కేశవ్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న విజయకుమార్

మహిళల సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి

సంతనూతలపాడు (చీమకుర్తిరూరల్): మహిళల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం జరిగిన ఐద్వా సంతనూతలపాడు మండల ఏడో మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు ఐద్వా నాయకులు అన్నాబత్తిన రమణమ్మ, కిలారి రాజ్యం అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మహిళల సమస్యలు పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మతాలు కులాల పేరుతో దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేసే కుట్ర జరుగుతోందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బంకా పద్మ, నెరుసుల మాలతీ, ఉపాధ్యక్షులుగా షేక్ నాగూర్ బీ, అబ్బూరి బసవమ్మ, సహాయ కార్యదర్శులుగా కే బుజ్జి, షేక్ మస్తాన్‌బీ, ఆర్ ఆదెమ్మ, కమిటీ సభ్యులుగా ఏ రమణమ్మ, కే రాజ్యం, కే పద్మ, ఎస్ ప్రేమ కుమారిలను ఎన్నుకున్నారు.



మహాసభలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలు అంజయ్యరోడ్డులోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహం-2 వార్డెన్ జి మునికుమార్‌ను సస్పెండ్ చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇప్పటికే గ్రీవెన్సులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన్నట్లు తెలిపారు. విద్యార్థులకు సరైన భోజనం పెట్టకుండా, హాస్టల్లో సరుకులు అన్నీ రాత్రి సమయంలో ప్రైవేటు వ్యక్తి ద్వారా బయటకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటను విద్యార్థులు విడియో తీసి కలెక్టర్‌కు ఇచ్చిన్నట్లు తెలిపారు. వార్డెన్‌పై అనేక సార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

స్మార్ట్ మీటర్లతో కూటమి ప్రభుత్వం మోసం

సంతనూతలపాడు (చీమకుర్తిరూరల్): స్మార్ట్ మీటర్లను బిగింపును ప్రజలంతా వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు ప్రజలను కోరారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ల బిగింపు వ్యతిరేకిస్తూ విద్యుత్ భారాలను రద్దు చేయాలని కోరుతూ స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై అనేక రకాల భారాలను ప్రజలపై వేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రజలు ఆలోచించి స్మార్ట్ మీటర్లు బిగింపును వ్యతిరేకించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమానికి మండల కార్యదర్శి షేక్ మస్తాన్, జీఎంపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్బూరి వెంకటేశ్వర్లు, నెరుసుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

నాగులుప్పలపాడు: ప్రజలపై బారాలు మోపే ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని ఉప్పుగుండూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి టీ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల్లో స్మార్ట్ మీటర్లు పగలు గొట్టాలని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అంకమ్మ పాల్గొన్నారు.

చీమకుర్తి: మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రజాసంఘాల నాయకులు మంగళవారం చీమకుర్తిలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్‌ను ప్రైవేటీకరణలో భాగంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు కార్యక్రమాన్ని అదానికీ అప్పగించారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, కే.చిన్నపురెడ్డి, కంకణాల వెంకటేశ్వర్లు, రామారావు పాల్గొన్నారు.

కొత్తపట్నం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల మీద భారాలు మోపడం అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. ఈతముక్కల సబ్‌స్టేషన్‌లో మంగళవారం స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఆగి సాగిన వేలం..

- ఒంగోలు 1వ వేలం కేంద్రంలో వేలాన్ని పరిశీలించిన ఏపీ రైతు సంఘం నాయకులు
- లో గ్రేడ్ పొగాకు అన్ని వేలం కేంద్రాల్లో కొనుగోలు చేయాలని డిమాండ్

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని పేర్నమిట్టలో ఉన్న ఒంగోలు-1 పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం వేలం ఆగి తిరిగి ప్రారంభమైంది. కొనుగోలు ప్రారంభంలోనే లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు వేలాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం బృందం వేలం కేంద్రంలో వేలాన్ని పరిశీలించింది. లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయకపోవడంతో వేలాన్ని అడ్డుకుని వేలం నిర్వహణ అధికారిని నిలదీశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జయంతి బాబు, పమిడి వెంకటరావు మాట్లాడుతూ వేలం కేంద్రానికి చీమకుర్తి మండలంలోని కె.వి పాలెం, గోనుగుంట, జీఎల్ పురం, మంచికలపాడు, టీ గుడిపాడు, బండ్లమూడి గ్రామాల నుంచి రైతులు పొగాకు బేళ్లు అమ్మకానికి తెచ్చారన్నారు. దాదాపు 1000 కు పైగా బేళ్లు కొనుగోలుకు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికే వేలం కేంద్రానికి తెచ్చిన బేళ్లు నాలుగు సార్లు వెనక్కి తీసుకెళ్లారని, దీని వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేలం నిర్వహణ అధికారి వెంటనే పొగాకు బోర్డు ఆర్‌ఎం రామారావుకు ఫోన్ ద్వారా వేలం కేంద్రంలోని పరిస్థితిని సమాచారం ఇచ్చారు. వెంటనే కేంద్రానికి వచ్చిన ఆర్‌ఎం రైతులతో మాట్లాడి, వ్యాపారులతో కూడా ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి కొనుగోలు మొదలుపెట్టారు. మొదటిసారి కంటే కాస్త మెరుగ్గా కొనుగోలు సాగినా చాలా వరకు లోగ్రేడ్ పొగాకు బేళ్లు తిరిగి తీసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. బ్రైట్ గ్రేడ్ పొగాకు బాగా డిమాండ్‌గా వ్యాపారస్తులు కొనుగోలు చేస్తూ లో గ్రేడ్ పొగాకును తిరస్కరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రభుత్వ రంగ సంస్థలకు రూ.1000 కోట్లు కేటాయించి కొనుగోలు చేయించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి లో గ్రేడ్ పొగాకును రూ.20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని కోరారు.